# రాజుబాబు దయారసం

కొనకళ్ల వెంకటరత్నం

(గతసంచిక తరువాయి)

"పోవయ్యా నీతో నాకేటి?' అని దుప్పటి కప్పేసుకుని, ముడుచుకుపోయి పండుకుని మెదలకుండా వూరుకున్నాడు మారెయ్య.

గిరుక్కున వెనక్కితిరిగి విషపు బాణంలాంటి చూపొకటి విసిరేశాడు వాడు.

ఆ చూపు ఎక్కడో సున్నితమైనచోట గుచ్చుకుంది రాజుబాబుకి

ఆ చూపులో వాడి దరిద్రమూ దైన్యమూ కాదు కొట్టొస్తా... ఆ బక్కవాడి రౌద్రమూ... రాజసమూ... ఉక్రోషమూ .. అన్నీ కలిసి గాడి పొయ్యిలో కట్టెపుల్లలల్లే పేలి భగ్గుమన్న ఒకానొక విప్లవజ్వాల చురకత్తివాటంగా దూసుకుపోయింది లోపలికి.

తల వంచుకుని క్లబ్బుకేసి నడుస్తున్నాడన్న మాటేగాని రాజుబాబు మనస్సు మనస్సులో లేదు. సుతిమెత్తని ప్రాణం చెయ్యని నేరమో, చేసిన అపరాధమో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది లోపల. కడుపులో దేవినట్టయింది.

ఇంతసేపూ హాజంకొద్దీ మారెయ్యతో తర్కించాడేగాని వాడన్న మాటలలో ఎంతోకొంత నిజం కలుక్కలుక్కుమని గుచ్చుకుంటోనే వుంది లోపల. కుమ్మరిపురుగులా దొలుస్తోంది అంతరాళంలో.

ఈ శివకామయ్య తన స్నేహితుడయితేనేంగాక. ఒక విధంగా మహా కక్కుర్తిమనిషి... ఆ ..

మళ్ళీ పేకాటల్లో. పలావ్ డిన్నర్లలో డబ్బు మంచినీళ్ళల్లే అతివుదారంగా ఖర్చుపెడతారు. ఆ..

ఈ సర్వర్లందరికీ ఒక్కొక్క యూనిఫారం'



సప్లయి' చెయ్యలేడూ? అవి రోజూ వుతికించలేడూ? బల్లలుతుడిచే గుడ్డలు రెండురోజులకొకసారి మార్పించలేడూ? హోటల్ అద్దంలా వుంటే... సర్వర్లు పరిశుభ్రంగావుంటే ... సర్వీసు నీటుగా వున్నదని కాఫీలకి నలుగురెక్కువగా మూగితే ... కలిశొచ్చేది మారెయ్యకా వాడికా? కనపడనీ... చెబుతాను... మొహం వాచేలా చివాట్లు వేస్తాను... పీనాసిముండాకొడుకు అనుకున్నాడు స్వగతంగా.

వాళ్ళకిచ్చే జీతాలేమో ముష్టిజీతాలా? తెల్లగా పరిశుభ్రంగా దుస్తులు ధరించివచ్చి హోటళ్లో సర్వ్‌చేసి ఇతగాడికి లాభాలు పేర్చిపెట్టాల్నా?

లోతుగా ఆలోచిస్తే ఈ కుళ్ళూ గలీజూ కాఫీ హోటళ్లోకాదు గవులు కంపు కొడుతున్నది ... మారెయ్య వొంటిని గాదు మడ్డిగారుతున్నది. ఈ శివకామయ్య కాపీనంలో...వాడి స్వార్థం మడతలలో...ప్రవహిస్తోంది మురుగు కాలవకింద అన్‌డర్‌గ్రవుండ్ డ్రెయినేజీ' అది. కంటికి కనపడదు

క్లబ్బులో కూచుని స్టార్ అండ్ స్టయిల్ పత్రిక తిప్పుతూ కూచున్నాడు రాజుబాబు మనస్సంతా గజిబిజిగావుంది దాన్నుంపతెగా ఆ మారిగాడిచూపు వెంటాడుతోంది; వేటాడుతోంది

ఇంతాజేసి తనేమో ఏనుగుమీద కూచున్నవాడు ఆ కుక్క కూసిందని తనకి జడుపెందుకూ? అర్థంకాని అలజడికి లోనయ్యాడు రాజుబాబు.

వాడి చూపులోవున్న వాడీ వేడీ తనమీద పదేపదే దాడిచేస్తున్నట్టుంది పేపరు చదువుతున్నా .. బిలియర్డ్స్ ఆడుతున్నా రమ్మీ' లో పేకముక్కలు కలుపుతున్నా... గోల్డుస్పాట్ 'తాగినా . టెన్నిస్ ఆట తిలకిస్తున్నా ..ఏదో అశాంతిగా వుంది

శివకామయ్య వచ్చాడు. గ్లాస్కో మల్లుపంచె వేళ్ళకి ఉంగరాలు ... వేళ్ళసందున వుడ్‌బైన్ సిగరెట్లు...

వస్తోనే చిన్నగా నవ్వాడు శివకామయ్య చిమచిమలాడుతున్నవాడల్లా చల్లబడిపోయాడురాజుబాబు

క్లబ్బు సెక్రటరీ తో కూచున్నారిద్దరూ. టెన్నిస్ ఛాంపియన్' నగేన్ వస్తున్నాడు ఆయన్ని ఎన్‌టర్‌టెయిన్ చెయ్యాలి. మన్నాడు మెనూ లో ఖారాఅయిటం పొటేటోచిప్సా బీట్‌రూట్ కట్‌లెట్లా అన్నచోట బ్రేక్ పడింది...ఆ గొడవకో ఎడ్డారు ... పట్టీ తయారుచేస్తున్నాడు సెక్రటరీ

ఎక్కడికి తీసికెళ్ళి ... మారెయ్యసంగతీ ... సర్వర్లకి యూనిఫారాలివ్వడం సంగతీ ఎత్తుదామనుకున్నాడు రాజుబాబు

ఇంతముఖ్యమైన తతంగాలమధ్య ఆ చిన్న విషయం ప్రస్తావించడం సిల్లీగా వుంటుందనిపించింది రాజుబాబుకి గమ్మున మూట్లాడకూరుకున్నాడు

దానికితోడు శివకామయ్య మాంచి హుషారుగా ఉన్నాడు. చెవిలో అప్పుడే వూదాడుకూడాను రాధాకృష్ణ లాడ్జిలో కొత్తగావాలిన రంగులరామ చిలకని వర్ణిస్తూ. ఇదివరకెప్పుడో ఎయిర్‌హోస్టెస్'ట సినిమాలో ఈ మధ్య సైడ్‌హీరోయిన్‌గా కూడా బుక్ అయిందట. అదొక లవనపు ఆకర్షణ సహజమూ, స్వచ్ఛమూ అయిన లైంగికాకర్షణలు వచ్చినై. అందమూ యౌవనమూ కాదు ఎంచేది దానికి డబ్బున్నదనీ దాన్ని జమీందా రుంచుకున్నాడనీ ..అది సినిమాలో వెయ్యిమంటున్నదనీ .. కృత్రిమమైన విలవల్ని సృష్టించుకుని వ్యామోహం పెంచుకుంటోంది నరపశువు

అంత మధురమైన క్షణాల్ని ... కోన్కిస్కా మారెన్న వ్యవహారంతో కెలికి ఖరాబు చెయ్యడం మనస్కరించలేదు రాజుబాబుకి. చెప్పినా వినవచ్చాడా మారెయ్యలాంటి మంద లేకపోతే శివకామయ్యలాంటికామందుకి వేలుమునగాపాడి ఎక్కణ్ణించీ అమరేను ఆ మాటకొస్తే? గొడ్డువాడు గొడ్డుకేడిస్తే గొడారి తోలుకేడుస్తాడు

ఇకపోతే శివకామయ్యమనస్సు మహాసున్నితం. చికాకుపెట్టే సమస్యల్ని భరించలేడు అక్కడికీ, టెన్నిస్‌కోర్టు పక్కన నెటుకీ సెట్టుకీ మధ్య లాన్ మీద కోకాకోలా సిప్ చేస్తున్నప్పుడు .. సంగినంగిగా, 'హారేయ్ మారెయ్య అస్పత్రిలో వున్నాడుస్మీ-వాణ్ణి వాళ్ళూపై తెలియకుండా పచ్చడికింద బాదేశావు నీ దుంపతెగా" అని ఒకమాట వొదిలాడు.

'వాడు చూట్టానికి చుంచెలకగాని ... గోడలు దవ్వేందుకు పందికొక్కురా నాన్నా హోటల్ సర్వర్ల యూనియన్‌లో వీడొక రింగ్‌లీడరు' అని రహస్యం చెప్పి రాజుబాబు నోరు మూయించాడు శివకామయ్య.

'అలానా? ఇంతకీ చచ్చాడా బ్రతికే వున్నాడా' అని పరామర్శించి. అంతలో. సింగిల్స్ ఆడుతున్న డెప్టీ కలక్టరుగా రబ్బాయి రామమోహన్‌కి వెల్‌డన్ అనీ. బ్యూటీ అనీ ఉషారివ్వడంలో వాళ్ళు మరిచిపోయాడు శివకామయ్య

ఇంతకన్నా శివకామయ్యని నొప్పించడం తగదు

అయినా తను ఈ గంప శ్రాద్ధమంతా నెత్తినెత్తుకోవడం దేనికిటా?

పోనీ మారెయ్యకి ఒక ఇరవై రూపాయిలు మనియార్డరు చేదామా అనుకున్నాడు రాజుబాబు పాపపరిహారంకింద ఏదోవొక విధంగా వాడికి జరిగిన అన్యాయానికి అపరాధం చెల్లించాలన్న మధన కొనసాగుతూనే వుంది లోపల.

శివకామయ్యలో అట్లాంటి సంచలనమేమీ కనిపించదుమరి నిష్కారణంగా వాణ్ణి చితగొట్టింది చాలక ... వాడు బ్రతికాడో చచ్చాడోనయినా పట్టించుకోకుండా...బేఫర్వాగా...నిష్పూచీగా . సంచరిస్తున్నాడు ఒకవిధంగా ఆలోచిస్తే అదే సరయిన పంథా అనిపిస్తోంది క్రమక్రమేణా. తనకి సరేసరి .. వాడి కుపకారం చేసే ఖలేజా లేదు, ఎట్లాగో చావనీ అని నిశ్చింతగా ఉండిపోనూ లేదు, అదీ వొక దౌర్బల్యమేను తనకి అంగరంగ వైభవంగా గడిచిపోతోంది చాలదూ?

ఆసుపత్రిలో మారెయ్య వున్న వార్డూ బెడ్ నెంబరూ గుర్తుంది.

బోయ్‌ని పిలిచి ఒక మనియార్డర్ ఫారం తెప్పించి అది నింపుతుండగా రాజుబాబుకి ఒక మీమాంస వచ్చిపడింది. ఇరవై పంపాలా? ఎది చాలదూ? తనకంటే...ఇరవై రూపాయలూ ఇరవై గులకరాళ్ళ క్రింద లెఖ్ఖ వాడికి అదొక నిధి! 'పదిచాలు అని జేబులో చెయ్యిపెట్టేసరికి అయిదు రూపాయల నోటొచ్చింది 'వాడికంతే ప్రాప్తం అనుకుని అయిదు రూపాయలకే యం. వో.-ఫారం నింపేశాడు తీరా ఫారం ముగించిన తరవాత చటన స్ఫురించింది. వాడు యం. వో. తిప్పిగొడితే? వాడి ధోరణి చూస్తే మహా టెంపరుగావున్నాడు ఆసుపత్రిలోనే ఒక పదిరూపాయిలు బక్షీస్‌కింద ముటజెపుదామా అన్న ఊహాపోయింది గాని...ఇస్తే మొహాన్ని కొడతాడేమో ..నలుగురిమధ్య తలవంపులై పోగలదు ...అని ఎస్తాయించాడు.

లాభంలేదు. ఫారం చింపేశాడు. అయిదు రూపాయిలనోటు పర్సులోకి వెళ్ళిపోయింది మళ్ళీ

## 6

రాత్రి కొంపకి చేరుకున్నాడు రాజుబాబు. మాట మంచీలేదు పేకాటలో సర్వమూ కైంకర్యమయిపోయింది గావును అనుకున్నది రాజవమ్మ.

ఆరాలడిగే హోమ్మస్సు లేదామెకి

భర్త ఎలాంటివాడైనా అణిగిమణిగి వుండడమే రూపాయికి పదహారణాల పాతివ్రత్యం క్రిందిలెఖ్ఖ ఆమెకి అలా ఎంచుకునే కోవకు చెందిన ఆదర్శ మహిళ ఆమె. అవసరమైతే...పతిదేవుడు పేకాటలో వోడి ఖిన్నుడుగా వున్నాడు గాబట్టి...వొంటిమీదున్న చంద్రహారమిచ్చి . అది మార్చుకుని రంగంలోకి దిగండి మళ్ళీ అనేవరకూపోయి...పతిభక్తికి ప్రామాణ్యంగా వ్యవహరించగల మహాఇల్లాలామె.

సృష్టి వైచిత్ర్యం ఇలాంటి గున్న ఏనుగులికి అలాంటి తామరతూళ్లు అందిస్తాడు భగవంతుడు

ఎదురు తిరిగి తప్పుదారి పట్టిన పెనిమిటిని .. నయానా భయానా.. అవసరమైతే హింసపెట్టి అయినా...సన్మార్గానికి మలిపే కార్యక్రమాలకి దిగిందా . గయ్యాళిగంప కిందలెఖ్ఖ మనకి మన సంప్రదాయానికే వ్యతిరేకమాయెను

ఇకపోతే రాజుబాబు తరహా— అతను మంచమెక్కినప్పుడే మొగుడు మంచం దిగీ దిగగానే యముడు ఇంట్లో అడుగు పెట్టాడా...ఇంటెల్లపాదీ . ఆడా మొగా.. మామయ్య మినహా.. అందరికీ హడలు సింహం గుహలో అడుగుపెట్టినట్టే ఉన్న నాలుగు ఘడియలూ ఇల్లు నిర్ధూమధామంచేసి వదలిపెడతాడు

పెనిమిటి అంత పెందరాళే ఇంటికి రావడం విడ్డూరంగానే వుంది రాజవమ్మకి.

వేన్నీళ్ళ స్నానం చేశాడు

అతని కిష్టమైన కాకరకాయి వేపుడు చేసింది, మారడగలేదు; రోజులా రుచులెన్నలేదు, పక్కని వెండి గిన్నెలో కర్పూరం లాంటి నెయ్యి ఘుమఘుమలాడుతోంది వొంపుకోవడం మర్చిపోయాడు ట్రిపాడ్ మీద తెరిచి వుంచిన పాన్‌దానులో తునికనటాకులు అట్లానే వాడిపోయినై.

ఎంతకీ నిద్ర పట్టదు ఆ మారెయ్య చూచిన చూపు అదొక చిన్న అగ్నికుండం అందులో

నించీ నిప్పురవ్వలు ఎగిరిపడి ... అటు తిరిగితే అటూ..ఇటు తిరిగితే ఇటూ..పక్కమీద చురుక్కుమంటున్నాయి మాగన్నుగా తెగమనిలాడు పట్టెమంచమ్మీద.

తెల్లవారిందో ఏమో గోడవారగా శీతాఫలపు చెట్ల గుబురులో, చెదరిన బూరుగుదూదికిమల్లే పింజలు పింజలుగా విడిపోతోంది పొగమంచు.

మదురుగోడమీద నుంచీ ఒక్కదూకు దూకాడెవడో లోపలికి

కప్పుకున్న ఎర్రశాలువలోనించీ పుట్టమీద నల్లత్రాచు పడగవిప్పినట్లు వాడి తలకాయ నిక్కబొడుచుకుంది ఇంకెవడూ, వాడే మారెయ్య ఆసుపత్రినించీ దొంగచాటుగా పరారీ అయి వచ్చాడుగావును రాస్కెల్

వాడి చేతిలో చిన్న చాకుంది

మెరుపల్లే రయ్యిన లోపలికి దూసుకొచ్చాడు వాడు.

కసుక్కున గుచ్చుకుంది గుండెల్లో.

కెవ్ మన్నాడు రాజబాబు

"ఏమిటండీ ..ఏక కలవరింతలూ మీరూను - మొహమ్మీదికంటా కప్పుకున్న ఫ్లానెల్‌రగ్గు తొలగించి పలకరించింది రాజవమ్మ.

## 7

ఆవేళ స్వతంత్రదినోత్సవం.

జాలీ క్లబ్బు ఆవరణంతా జిగ్గున వెలిగిపోతోంది.

చువ్వలగేటు ముందూ ..భోగావళీతీగ ప్రాకిన అర్చి చుట్టూతానూ .. దోరణాలు తోరణాలుగా లైటింగ్ అరేంజిమెంట్లుచేశారు. సైప్రస్ క్రోటన్ మొక్కలూ, సింగపూరు నూరువరహాల చెట్లూ ఫలవృక్షాలకిమల్లే మిగుల్చముగ్గిన పళ్ళతో భారంగా వొంగినట్లు ... తమాషాగా వైరింగ్‌వేసి రంగు రంగుల ఎలక్ట్రిక్ బల్బులు' అమర్చి అపురూపంగా అలంకరించారు.

క్లబ్బు మెంబర్లందరికీ ఉషారెక్కువయింది ఆవేళ. ఎవరికిష్టమైన ఆటపాటల్లో వాళ్ళు మునిగిపోయారు. పింగ్‌పాంగ్ దగ్గర కొందరూ ... బిలియర్డ్స్ టేబిల్ దగ్గర కొందరూ ... ఎక్కువమంది రవుండ్ టేబిల్స్ చుట్టూ ఇన్‌టర్‌నేషనల్ రమ్మీలో చిన్నచిన్న గ్రూపుల్రకింద విడిపోయారు.

కట్‌జోకర్‌దగ్గర ముక్కలు కలుపుతున్న రాజుబాబుని కనుసైగచేసి పిలిచాడు శివకామయ్య దూరాన్నించి.

ఆమట్న తన చెయ్యి ఒకనేస్తానికి బదలాయించేసి గబగబ లేచివచ్చాడు రాజుబాబు ఆ ఎలుపులో వున్న మాధుర్య మట్లాంటిది

శివకామయ్య రహస్యంగా మోచేత్తో పొడిచినా, దూరాన్నుంచి కన్నుగొట్టినా ..ఎక్కకొచ్చి చెవిలో వూదినా...వేరువేరు అర్థాలుంటాయి. ఆ భాష వాళ్ళిద్దరికే తెలుసును.

గెస్ హౌస్‌లో రూం ఖాళీగా వుంది. దానికి దిల్‌కుష్‌కార్నరని ముద్దుపేరు బోయ్ సోడాలు పట్టుకొచ్చి రెడీ గా వున్నాడు. వేకేజి పెట్టెలు విప్పి అప్పుడే దింపిన గరం గరం స్కాచ్‌విస్కీ


# ప్రగతి
## సచిత్రవారపత్రిక

## ప్రకటన రేట్లు

| | |
|---|---|
| కాజుయల్ కాలం సెం. మీ. | రు. 4-50 |
| కాంట్రాక్టు ,, ,, | 3-50 |

[ఒక సంవత్సరానికి 250 సెం. మీ. మరియు ఆపైన]
కనీసం 5 సెం. మీ. x సింగిల్ కాలం

## రేపర్స్ : బ్యాక్ కవర్

| | | ఒకసారి వేయడానికి |
|---|---|---|
| ఒక రంగులో | కాజుయల్ ,, | రు. 375/- |
| | కాంట్రాక్టు ,, | రు. 325/- |
| రెండు రంగులలో | కాజుయల్ ,, | రు. 425/- |
| | కాంట్రాక్టు ,, | రు. 375/- |
| మూడు రంగులలో | కాజుయల్ ,, | రు. 475/- |
| | కాంట్రాక్టు ,, | రు 425/- |

## రెండవ మరియు మూడవ రేపర్ ఒక రంగు

| | | |
|---|---|---|
| కాజుయల్ | ఒకసారికి | రు. 350/- |
| కాంట్రాక్టు | ,, | రు 300/- |

## లోపలి పేజీలు

| | | |
|---|---|---|
| కాజుయల్ | ఒకసారికి | రు. 300/- |
| కాంట్రాక్టు | ,, | రు. 240/- |

*మీ వ్యాపారాభివృద్ధికి ప్రగతి సచిత్రవార పత్రికను ఉపయోగించుకొన గోర్తాము*

## చందా రేట్లు

| | పోస్టుద్వారా | ఏజెంటుద్వారా |
|---|---|---|
| 3 మాసాలకు | రు. 5-20 | రు. 4-50 |
| 6 మాసాలకు | రు. 10-40 | రు. 9-00 |
| సంవత్సరానికి | రు. 20-80 | రు. 18-60 |

## ప్రగతి సచిత్ర వారపత్రిక

విశాలాంధ్ర బిల్డింగ్స్
మాచవరం : : విజయవాడ-4.

బాటిల్బు కార్కు లూడదీసి గ్లాసులో పోశాడు రాజుబాబుకి.

శివరామయ్యకి త్రీ దేగర్సు హోవర్డు గోల్కొండ బ్రాందీ వేలపించిదివంతు. ప్యారిస్ కాని యే బ్రాందీ తగిలినేనేగాని గురుడందు కోడు. స్వర్లోకపు కవాటాలు తెరుచుకోవు. అత గాడికి అదే వొంపాడు బోయ్

పానీయం మనిషినెత్తురల్లే గ్లాసు లోతట్టున సీలింగ్‌ఫాన్ కింద జలాజలా మెరిసింది టపాటపా సోడాలు కొటి వొంపాడు బోయ్' తెల్లత్రాచు పడగ విప్పినట్టు బుసబుసమని పొంగొచ్చి నురుగులు గ్లాసుపై అంచులు సోకినై.

'ఒరేయ్. చుక్కాముక్కా అక్కచెల్లెళ్ళు .. ముక్కేదిరా అని ఒక్క ఉరుము ఉరిమాడు శివకామయ్య. ఒక్కపరుగున వెళ్ళి ప్లేటనో ఈట్స్ పట్టుకొచ్చాడు బోయ్. అయిసు ముక్క లొక 'ప్లేట్లో' నూ ముల్లంగి టమాటాస్లయిస్' తో సేలడ్ ఒక ప్లేట్లోనూ పేర్చి రాజుబాబు పక్కకి తోశాడు సాండ్‌విచెస్సూ సార్డయిన్సూ శివకామయ్య అందుకున్నాడు. మధ్య మధ్య కోడి పలావూ, కైమా వుండలూ ఆరగింపుకి సిద్ధంగా వున్నాయి. జీడిపప్పులు జాయింటు' గా నమిలేందుకు ఒక ప్లేట్లో ఇద్దరి మధ్యకీ నెట్టాడు

పెగ్గుమీద పెగ్గు బిగించేస్తున్నా రిద్దరూను.

చుక్కా ముక్కా...చుక్కా ముక్కా... ప్లేట్లో బుడ్లూ ఖాళీ అయిపోతున్నాయి

శివకామయ్య బకాసురుడు. ఎన్ని పెగులు వరాసగా చెల్లగొట్టినా చెక్కుచెదరడు. పైపెచ్చు మోతా దెక్కువయిన కొద్దీ మేధస్సు పదునెక్కుతుంది. రాజుబాబు అంత హరాయించుకోలేడు. రెండు గ్లాసులు ఖాళీ అయ్యేసరికే కళ్లు డేంజర్‌లైట్లయి .. ఎర్రజీరపడిపోయి ... మొహం కండలుబ్బి . మెదట్లో మసకేసిపోయి ..ఆలోచనలు చిట్లడం ప్రారంభించినై.

ప్రథమదశలో శివకామయ్య సరసని ఇంకో శివకామయ్య కనిపించాడు రాజుబాబుకి. ఆ తరవాత వాళ్ళిద్దరూ కూడబలుక్కుని శీర్షాసనం వేస్తున్నారా అన్నట్టు తలక్రిందులుగా అగుపించారు.

రాస్కెల్స్ ఇక్కడా ఆసనాలు

గదంతా .. మూలనున్న వాష్‌బేసిన్ తో సహా రాధారిలో'ఒల్లే అటూయిటూ వొరిగింది ఆ తరువాత విమానాశ్రయంలో అడుగుపెట్టినట్టూ ... హెలీకాప్టర్ మీద 'జాయ్‌రైడ్ చేస్తున్నట్టూ ఊగిపోయారిద్దరూ.

ఎయిర్‌హోస్టెస్సల్లే కనిపించాడు బోయ్ ఇక తప్పుకున్నాడు వాడు.

మొదట్లో మాటలు నాలికమీద ఈడిగిలపడి .. ఆ తరువాత సీమటపాకాయలల్లే పేలినై రాజుబాబు పెదిమలమీద ఇక పేలాపన సాగించాడు.

'ఒరే ... కామిగా ... ఆ మారిగాణ్ణి పంపేశావుగదరా" అని ఉపక్రమించాడు.

'చచ్చాడా? జాన్‌దేవ్ .. తిన్నగా వీరస్వార్గంలోకే వెళ్ళుంటాడు... బస్.. మనమేమో ఈ భూతలస్వార్గంలోనే ఉండిపోయినాం ... అక్కడ మన భవానీకేఫ్‌కి ఒక బ్రాంచీ' 'వోపెన్ చేదాంరా బ్రదర్ ... వాణ్ణి అక్కడ ఇరికించేద్దాం... అందులో ముప్పావళా వాటా నీది . తీసుకో బ్రదర్ తీసుకో... మేనేజింగ్ పార్ట్‌నర్ రాజిగాడికీ జిందాబాద్" అరిచాడు శివకామయ్య.

'ఒరే బ్రదర్ .. చచ్చాడ్రా వాడు చచ్చాడ్రా.. పొద్దువేళ ఎక్కమీదకొచ్చి చెప్పాడురా నాకు. రేత్తిరి రెండు గంటలవేళ హంస ఎగిరి చక్కాబోయిందిట" ఊగిపోతున్నాడు రా జు బా బు. తూలుతో, 'ఏబ్రాసి నా కొడకా . ఇప్పుడైనా ఆడికి యూనిఫారమివ్వరా... యూనిఫారం రాస్కెల్ వందలకి వందలు పోసుకుంటున్నావుగదరా ఇన పెట్టిలో.. ఇస్తావా ఇవ్వవా నా కొడక..."

'వందలా ఛేస్ వేలురా బ్రదర్ వేలు"

'కరెక్ట్.. మొన్నటికి మొన్న ...అటో మేడా, ఇటో మేడా కొనేస్తివి గదరా...నువ్వు నువ్వు-'

'లేకపోతే ..ఆడు...ఆ నరిసిములు హోటల్ పెడతాడురా అందుకో ... అందుకని పేకమ్మున కొనేశామేడ ... కొని దానిపైన ఓ రూం కేటాయించేశాగా మనకీ; మనపిట్టల్ వాలేందుకు" కంఠస్వరం తగ్గించి పళ్ళికిలించాడు శివకామయ్య.

గ్రుక్కిళ్ళు మింగాడు రాజుబాబు

'ఒరి దేష్టా ఆడికి ..ఆ మారెయ్యకి ...ఖాకీ యూనిఫారం ఇస్తవా ఇవ్వవా? పాతేస్తా నిన్ను. నా కొడక...' గ్లాసువొదిలి, శివకామయ్య పీక పట్టుకున్నాడు రాజుబాబు

ఒక్క తోపు తోశాడు శివకామయ్య.

పట్టువొదిలి గాడ్రెజ్ సోఫాలో కూలబడ్డాడు రాజుబాబు.

దగ్గరకి తూలుతో వచ్చి కళ్ళల్లో కళ్ళుపెట్టాడు శివకామయ్య

దిరీసులా సర్వర్లకి దిరీసులా? ఆడికి గుడ్డల సప్లయి కాకేట్రా? . పోకిరీ...రామన్న కాపుకి ఎంపీ పాగా ఇచ్చినావు?'

'ఓరి లత్తుకోరి హోటల్లో సర్వీస్ క్లీన్‌గా వుండాలెరా క్లీన్. నేను బిలు ఇస్తుంటేనే ..బిల్లు. అది నీకురా నీకు .అది సాంబార్లో కలరాపురుగుల ఖరీదుట్రా? పింజారీ నీ యాలికన్నం పెడితే ఊరికినే ఎకారముట్రా? చందా నన్నివ్వమంటావూ? చందా 'చొక్కా కాలర్ వొడిసిపట్టుకుని గుంజాడు రాజుబాబు.

వాపేసుకున్నాడు శివకామయ్య.

జాగ్రే జావ్. సర్వర్లకీ దిరీసులా? ఇవ్వు... నువ్విచ్చావురా బ్రదర్. ముఖాపాదారివి పిల్ల జమిందారివి నాకు దబ్బేదీ? రంగమ్మకి వందా? రవణమ్మకి రెండొందలా?' నచ్చజెబుతున్నాడు శివకామయ్య.

'అదిగో. మాట తప్పిస్తున్నావు. వుండాకోర్ ఆడికి గుడ్డలిచ్చిందుకు గొల్లుమంటావు ... గజ్జెల చెరువు పక్కనికొత్తగా లాడ్జీ కడుతున్నావు లాడ్జి అది బొమికల్లో సున్నంతోనే గదరా ..నాయాల.. నువ్వేమో ఛంపేశావు అదేమో దెయ్యమయ్యాడు . ఉండు ..నీ రగదం కళ్ళ జూడనివ్వాళ ..ఒరే . ఛోక్రా...కత్తి ..నా క్రకత్తి యాడుందిరా ..

వీణ్ణి పొడిచేస్తా ..ఇటీ' సోపాకింద దూరి వెతికాడు రాజుబాబు క్రకత్తి కోసమని.

కిందికి వొంగి పుల్లు పుల్లుమని చూస్తో పక్కపక్కన్నే తచ్చాడాడు శివకామయ్య. పకపకనవ్వి 'దిరీసులంటున్నాడు దిరీసులు ఒరే...స్కూవుంట్రడల్ నీ ఆయిలుమిల్లులో కూలీలకి ఖాకీ నిక్కర్లివ్వు ముందు ..ఆడ కూలీలకి జంపర్లన్నా ఇవ్వాశె...ఏరా రాజీ మీమామయ్యతో చెప్పావూ? రామన్నకాపు కన్యాయం జరిగిందా శర్మం వొలిచేస్తా . నాయాల ... శర్మం' పిడికిలి బిగించి బొటన వేలుతో డొక్కలో పొడిచాడు శివకామయ్య.

రాజుబాబు పందెంలో కోడిపుంజులా మొహం పెట్టాడు తలవంచి

'అద్గో .. మళ్ళీ మాట మారుస్తావేరా స్టుపిట్ సర్వర్లకి దిరీసులు కుట్టిస్తవా లేదా...పోనీ మారెయ్యకి ..చెప్పు...

'ఛేస్.మాటతప్పిస్తున్నది నువ్వా నేనా? కంత్రీ! నేను రామన్న ఎవ్వారమెత్తితే నువ్వు మారెన్న నిక్కర్లో దూరతావూ భోసడీక ఆడి జమ్మిల్లు మొన్న గాలివానకి పడిపోయిందిగాని... వేసిపెట్టరా ఎదవన్న వేసిపెట్టు ..పుణ్యముంటుంది. లోఫర్‌నా కొడక ...తాగినావేట్రా తూలుతన్నావు ... తప్పు గదరా...తప్పుతప్పు... పెద్దమడిసివి"

శివకామయ్య ఆ మూల కుషన్ కుర్చీలోనూ, రాజుబాబు ఇటు ఎదురుగా 'బెడ్-కం-సోఫా లోనూ జారగిలబడి... ఒకళ్ళ కళ్ళల్లోకి ఒకళ్ళు గుచ్చి గుచ్చి చూచుకొంటూ పదినిమిషాలు అలానిశ్చలంగా కూచుండిపోయారు.

నిషా దిగుతున్నఛాయలో ఏమో ఉషస్సుమాదిరి మెత్తని వెలుగొకటి ప్రసారమవుతోంది ఇద్దరి ముఖబింబాలమీదా.

ఈలోగా వీళ్ళిద్దరూ కొట్టుకు ఛస్తున్నారు బాబో' యని, బోయ్ పేకాటమైకంలో వున్న మురావగ్గర గొల్లుమన్నాడు.

ఆమట్న అంతా బిలబిలలాడుతూ వచ్చేశారు.

రాజుబాబు, శివకామయ్య దగ్గరికి నింపాదిగా నడిచివెళ్ళి—

'ఒరేయ్ బాబ్జీ .. మనకీ మనకీ మధ్య ఆసరీ పోట్లాటెందుకొచ్చినట్టు? అని గెడ్డం పుచ్చుకుని బ్రతిమలాడాడు.

'అవునవును ..గ్యాపకం వొచ్చిందిరోయ్... మనమిద్దరమూ ఒక్క మూసలో కణికలం గదరా బ్రదర్'

ఛేస్ .. ఒక్క కడుపున పుట్టిన కవలపిల్లలంరా"

టేబిల్ కటూ యిటూ దొరంపోజులో నిల్చుని చెయ్యీ చెయ్యీ కలుపుకుని ..కరచాలనం చేసుకుని...ఆ తరవాత కటిక్కిన కౌగలించుకున్నారిద్దరూను.

అంతా గుమికూడి చూచేసరికి ... రెండు స్వ రూ పా లూ ఐక్యమైపోయి ఒకే ఒక్క మాంసం ముద్ద కనిపించింది. ఒకరి కవుగిట్లో ఒకరు హత్తుకుపోయి వున్నారు రాజుబాబూ, శివకామయ్యాను.

ఆ తరవాత మారెన్న కలలో కనిపించడం మానుకున్నాడు రాజుబాబుకి. (అయిపోయింది)